క్లుప్తంగా

పట్టణ నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్



సిరిసిల్ల: సిరిసిల్ల పట్టణ నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా సమ్మెట శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కొత్వాల్ ప్రసాద్ ఎన్నికయ్యారు. సిరిసిల్ల సంఘ భవనంలో శనివారం జరిగిన ఎన్నికల్లో నాయీ బ్రాహ్మణ సంఘం సభ్యులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. అధ్యక్షుడిగా శ్రీని వాస్, ప్రధాన కార్యదర్శిగా ప్రసాద్‌లు భారీ మెజార్టీతో విజయం సాధించారు. ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులకు సంఘం సభ్యులు అభినందించారు.

ఆరోగ్య యువతతోనే సమాజాభివృద్ధి



మాట్లాడుతున్న పరశురాములు

ఎల్లారెడ్డిపేట: ఆరోగ్యకర యువతతోనే సమాజాభివృద్ధి సాధ్యమని ఎన్‌ఎస్‌ఎస్ ఇన్‌చార్జి అధికారి వాసరవేణి పర్శరాములు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జూనియర్ కాలేజీలో శనివారం నిర్వహించిన హెచ్ఐవీ, డ్రగ్స్ నివారణ అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మెంబర్ దుంపెన రమేశ్, భరత్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై ఆంజనేయులు

కోనరావుపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై ఆంజనేయులు అన్నారు. ధర్మారంలో శనివారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో దొంగతనాలు, నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. యువకులు గస్తీ తిరగడంతో పాటు ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 కు ఫోన్ చేయాలని సూచించారు. గ్రామపెద్దలు వెంకన్న, పొన్నం తిరుపతి, మిర్యాల్‌కార్ బాలాజీ, ఎల్లయ్య, ముడికె మల్లయ్య, ఎల్లయ్య, రాజ్‌కుమార్, కానిస్టేబుల్ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఐకమత్యంగా మెలగాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

తంగళ్లపల్లి: మండలంలోని చీర్లవంచలో శనివారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. గ్రామస్తులంతా కుల మతాలకు అతీతంగా మెలగాలని గ్రామాన్ని సమష్టిగా అభివృద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రేణుక, ఎంపీడీవో (ఎఫ్ఏసీ) జోగం రాజు, ఆర్ఐ మధు, పంచాయతీ సెక్రటరీ జనార్దన్, అంబేద్కర్ సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బస్టాండ్ లేక తిప్పలు



దుకాణాల ముందు కూర్చున్న ప్రయాణికులు

కోనరావుపేట: మండలంలోని మరిమడ్లలో బస్టాండ్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కూర్చునేందుకు కూడా స్థలం లేకపోవడంతో ఎండలో అవస్థలు పడుతున్నారు. మండలంలోని మరిమడ్ల మీదుగా గర్జనపల్లి, నిజామాబాద్ జిల్లా సిరికొండ, మానాల, సిరిసిల్ల, కోనరావుపేట ప్రాంతాలకు రోజూ వాహనాలు, ప్రయాణికులు వెళ్తుంటారు. వీరందరికీ మరిమడ్ల కేంద్రంగా ఉంది. కొన్నేళ్ల క్రితం రేకుల షెడ్డులో ఉన్న ప్రయాణ ప్రాంగణాన్ని కూల్చివేశారు. తిరిగి నిర్మిస్తామని చెప్పినా అధికారులు నిర్మించలేదు. కొన్ని నెలలుగా బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణికులు ఎండలో నిల్చొని బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి. కూల్చిన బస్టాండ్ ప్రాంతంలో తాత్కాలిక పందిరి వేశారు. వేసవి ఎండలు ముదరడంతో దుకాణాల వద్ద కూర్చుంటున్నారు. అధికారులు స్పందించి బస్టాండ్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కలప పట్టివేత

వీర్నపల్లి : మండలంలోని రంగంపేట గ్రామంలో అటవీశాఖ అధికారులు శనివారం తనిఖీ చేయగా దర్శనాల నారాయణ ఇంటి వద్ద సుమారు రూ.3,500 విలువ చేసే కలపను పట్టుకున్నారు. స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

వేసవిలో చల్ల చల్లగా..



జ్యూస్ ధరలు..

స్ట్రాబెర్రీ	50	ఆరెంజ్	40
ఆపిల్	40	గ్రేప్	40
దానిమ్మ	70	సపోట	40
పైనాపిల్	30	ఖర్బూజ	40
మ్యాంగో	40	లెమన్	15
కాక్‌టెయిల్	40		

- వేసవి తాపం తీరుస్తున్న జ్యూస్‌సెంటర్లు
- తాజా పండ్లరసాలు, శీతల పానీయాల కోసం జనం క్యూ
- పట్టణంలో జోరుగా విక్రయాలు

సండే స్పెషల్

సిరిసిల్లటౌన్: రోజురోజుకూ ఎండలు మండుతున్నాయి. భానుడి ప్రతాపానికి జనాలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. దీంతో చల్లని శీతల పానీయాల వైపు ప్రజలు పరుగెడుతున్నారు. దీంతో సీజన్‌తో సంబంధం లేకుండా పలురకాల పండ్లతో కూడిన జ్యూస్ సెంటర్లు అందుబాటులో ఉన్నాయి. జిల్లాకేంద్రంలో పలురకాల పండ్లు, కొబ్బరిబోండాలు, చెరుకురసాలు, పండ్ల రసాల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. చిరువ్యాపారులు జ్యూస్‌స్టాళ్లు నిర్వహిస్తూ ప్రజల వేసవి దప్పికను తీరుస్తున్నారు. దీనిపై సండేస్పెషల్ కథనం..

ఉపాధికి బాటలు

వేసవితాపం తీర్చుకునేందుకు పట్టణ ప్రజలు రోజూ రూ.లక్షలు ఖర్చుచేస్తున్నారు. జిల్లాకేంద్రం మొత్తంగా వేసవిలో ఉపాధి నిచ్చే జ్యూస్ సెంటర్లు విరివిగా ఉండగా మామూలు రోజుల్లో పదుల సంఖ్యలో ఉండే సెంటర్లు వేసవిలో వందకు పైగా వెలిశాయి. చాలా మంది సీజనల్ ఉపాధిగా ఈవ్యాపారాన్ని ఎంచుకొని పోటాపోటీగా స్టాల్స్ ఏర్పాటు చేస్తూ..ఉపాధికి బాటలు వేసుకుంటున్నారు. రోజూ ఒక్కో జ్యూస్ సెంటర్‌లో రూ.5వేల నుంచి రూ.10వేల వరకు వస్తున్నట్లు నిర్వాహకులు తెలుపుతున్నారు. సిరిసిల్ల మొత్తంగా ఒక్కరోజులో రూ. 5 లక్షలకు పైగా ప్రజలు తాజా పండ్ల రసాలకోసం ఖర్చు చేస్తున్నారు. కెమికల్స్, ఫ్లేవర్స్‌తో లభించే చల్లని పానీయాలను కాదని ఆరోగ్యాన్నిచ్చే జ్యూస్‌లు తాగుతున్నారు.

నిరంతర ఉపాధి

ఎండల ధాటికి ప్రజలు తట్టుకునేందుకు ఏర్పడిన జ్యూస్ సెంటర్లు చిరు వ్యాపారులకు పండంటి ఉపాధిని అందిస్తున్నాయి. పక్షం రోజులుగా ఎండలధాటి పెరుగడంతో మధ్యాహ్న వేళలో ప్రజలు దాహానికి ఆగడం లేదు. ఈక్రమంలో వేసవి తాపాన్ని తగ్గించుకునేందుకు గాను ప్రజల కోసం జ్యూస్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. ఫిబ్రవరి మాసం నుంచి దాదాపు నాలుగు నెలలపాటు పండ్ల రసాల అమ్మకాలు జోరుగా సాగునుండటంతో యువకులు, చిరు వ్యాపారులు సీజనల్ ఉపాధిగా వీటిని నిర్వహిస్తున్నారు. ఎండాకాలంలో శీతల పానీయాలకు బదులుగా తాజా పండ్ల రసాలను సేవించాలని డాక్టర్లు సైతం సూచించడంతో వీటికి డిమాండ్ పెరిగింది.

తాజా పండ్ల రసాలు

అన్ని జ్యూస్‌సెంటర్లలో హైదరాబాద్, వరంగల్, విజయవాడ, మహారాష్ట్ర నుంచి పండ్లు దిగుమతి చేసుకొని తాజా పండ్ల రసాలను కస్టమర్లకు అందిస్తున్నారు. ఎండలు పెరగడంతో జ్యూస్ స్టాళ్లకు గిరాకీ పెరిగింది. సిరిసిల్లలోని పాతబస్టాండ్, కొత్తచెరువు, అంబేద్కర్‌చౌక్, గాంధీచౌక్, మార్కెట్ ఏరియా, కొత్తబస్టాండ్, గోపాల్ నగర్, కలెక్టర్ కార్యాలయం ప్రాంతాల్లో జ్యూస్ సాళ్లు వెలిశాయి. సుమారు వంద జ్యూస్ సెంటర్ల నిర్వహణలో 200మంది ఉపాధి పొందుతున్నారు.

పండ్ల రసమంటే ఇష్టం



అన్ని కాలాల్లో జ్యూస్‌లు తాగడమే మంచిది. డాక్టర్లు కూడా ఇదే సూచిస్తారు. తాత్కాలిక ఉపశమనం కోసం కూల్ డ్రింక్స్ తాగిగే ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. ఆరోగ్యవంతంగా ఉండేందుకు శీతల పానీయాలు కాకుండా జ్యూస్ తాగుతారు. నేను తాజా పండ్లరసం తాగేందుకు ఇష్టపడుతా.

– కట్ల ఆనందం, సుభాష్‌నగర్,

గిరాకీ పెరిగింది



వేసవి ఎండలు ముదిరాయి. సీజన్‌తో సంబంధం లేకుండా అన్నికాలాల్లో అందుబాటులో జ్యూస్‌లు మావద్ద తయారుచేస్తాం. వేసవిలో డిమాండ్ మరింత ఎక్కువగా ఉంటుంది. అన్నిరకాల పండ్లను దూర ప్రాంతాల నుంచి తెప్పిస్తాం.

– కంచర్ల రవిగౌడ్, జ్యూస్ సెంటర్ నిర్వాహకుడు.

జ్యూసులే ఎక్కువగా



పండ్ల రసాలు తాగడం ద్వారా వేసవిలో రుచితో పాటు ఆరోగ్యంగా ఉండవచ్చు. సిరిసిల్లలో హైదరాబాద్, ఇతర నగరాలకు తీసిపోని విధంగా అన్నిరకాల పండ్ల రసాలు అందిస్తున్నారు. వేసవిలో టీ, కాఫీలు తక్కువ చేసి జ్యూస్‌లు ఎక్కువగా తాగుతాం. ఐస్‌తో పాటుగా..ఐస్ లేకుండా జ్యూస్‌లు అందిస్తున్నారు.

– తడుక గణేశ్, సిరిసిల్ల

అవకాశం ఇస్తే ఎంపీగా పోటీ చేస్తా

- కటకం మృత్యుంజయం
- సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే



సీఎంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న మృత్యుంజయం

గంభీరావుపేట: పార్లమెంట్ ఎన్నికల్లో అవకాశం ఇస్తే ఎంపీగా పోటీ చేస్తానని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి ఈమేరకు విన్నవించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా సుదర్ఘీ కాలం కాంగ్రెస్‌కు సేవలు అందించానని, అనుభవం ఉందని తెలిపారు.

వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలి



మాట్లాడుతున్న కడారి రాములు

సిరిసిల్లటౌన్: స్తంభించిన సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలని ఏఐటీయూసి ప్రధాన కార్యదర్శి కడారి రాములు కోరారు. శనివారం సిరిసిల్లలోని పార్టీ కార్యాలయంలో జరిగిన పవర్‌లూమ్ కార్మిక సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే కేటీఆర్ వల్లే ఈదుస్థితి ఏర్పడిందని, కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పరిశ్రమ సంక్షోభ నివారణకు ఏమాత్రం చర్యలు చేపట్టడం లేదని దుయ్యబట్టారు. పరిశ్రమకు ప్రభుత్వ బకాయిలు చెల్లించి, కొత్త ఆర్డర్లు ఇవ్వాలని కోరారు. నాయకులు అజ్జ వేణు, పంతం రవి, నల్ల చంద్రమౌళి తదితరులున్నారు.

వేసవి భత్యం చెల్లించాలి

ఉపాధిహామీ కూలీలకు వెంటనే వేసవి భత్యం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రావణపెల్లి మల్లేశం, సోమ నాగరాజులు డిమాండ్ చేశారు. లేకపోతే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. నాయకులు రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం



వేములవాడ: ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని మున్సిపల్ వైస్‌చైర్మెన్ బింగి మహేశ్ అన్నారు. పట్టణంలో ఒకినావా స్పోర్ట్స్ కరాటే అకాడమీ సంస్థ చీఫ్ ఎగ్జామినర్ అబ్దుల్ మన్నాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో 120 మంది విద్యార్థులకు కరాటే బెల్టులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడపిల్లలకు ఆత్మరక్షణ అవసరమన్నారు. కార్యక్రమంలో సంకెపల్లి ఎంపీటీసీ బుర్ర లహరి– శేఖర్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్, పీర్ మహమ్మద్, సీనియర్ కరాటే మాస్టర్లు ఆర్ విజయ్, అవధూత రజినికాంత్, దండుగల తిరుపతి, లోలోపు రాజు, దండుగల దేవరాజు, మల్లపాటి తిరుపతి, రాజశేఖర్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

ముస్తాబాద్: సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్ అన్నారు. సిద్దిపేట జిల్లా ఆస్పత్రి వైద్యాధికారి చందర్‌నాయక్ స్వగ్రామంలో సేవాలాల్‌తండాలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సీఐ సదన్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఊరు అభివృద్ధి, బాగుకోసం డాక్టర్ చందర్‌నాయక్ రూ.40వేల విరాళాన్ని సీసీ కెమెరాల కోసం అందించడం అభినందనీయమన్నారు. ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన డాక్టర్ చందర్ వైద్య దంపతుల సేవలు ప్రశంసనీయమన్నారు. ఎస్సై శేఖర్‌రెడ్డి ఉన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి



వేములవాడ అర్బన్ : మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

వేములవాడ అర్బన్: రైతుల సంక్షేమానికి పాలకవర్గం కృషి చేస్తోందని వేములవాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ఏనుగు తిరుపతి రెడ్డి అన్నారు. శనివారం వేములవాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పాలకవర్గంతో పాటు సమావేశంలో తీర్మానం చేసిన అంశాలు, అభివృద్ధి పనులను వివరించారు. ఖరీఫ్ నుంచే రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్‌ను ప్రభుత్వం చెల్లించాలని సమావేశంలో తీర్మానం చేసినట్లు తెలిపారు. చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక సహకార సంఘంలో ఇప్పటికే 3,610 మంది రైతులు సభ్యులుగా ఉన్నారని, సహకార సంఘంలో రైతులకు దీర్ఘకాలిక రుణాలు, పంట రుణాలు, బంగారంపై రుణాలు, అందజేస్తున్నామన్నారు. సుమారు రూ.63కోట్ల వ్యాపారం ఈ సంవత్సరం కొనసాగిందన్నారు. సహకార సంఘం వైస్ చైర్మన్ లక్ష్మీకాంతారావు, డైరెక్టర్లు తోటరాజు, వెంకటేశం, అమృత, మల్లేశం, సంజీవరెడ్డి, లచ్చిరెడ్డి, సురేందర్‌రెడ్డి, రాజయ్య, సీఈవో లక్ష్మణ్ ఉన్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం..

ఎల్లారెడ్డిపేట: రైతుల సంక్షేమమే లక్ష్యంగా సింగిల్ విండోలు పని చేస్తున్నాయని, పెద్ద మొత్తంలో వ్యవసాయ అనుబంధ రుణాలను అందించామని సింగిల్‌విండో చైర్మన్లు గుండారపు కృష్ణారెడ్డి, రామగిరి సుధీర్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిపేట, రాచర్ల తిమ్మాపూర్ సింగిల్‌విండోల మహాజన సభలను నిర్వహించారు. రైతులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించేందుకు వ్యవసాయ అనుబంధ రుణాలను పెద్ద మొత్తంలో అందించామన్నారు. ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచి అవసరమున్న రైతులకు సబ్సిడీపై అందించినట్లు తెలిపారు. భవిష్యత్తులో బంగారు ఆ భరణాలపై రుణాలు ఇస్తామన్నారు. రైతులు రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. వైస్ చైర్మన్లు కృష్ణమూర్తి శర్మ, సత్తయ్య, డైరెక్టర్లు, సీఈవోలు కిశోర్‌కుమార్, శశివర్ధన్ గౌడ్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం ఆరెపల్లి శివారులోని కరీంనగర్ – సిరిసిల్ల రహదారిలో పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది శనివారం ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో సిబ్బంది జగన్, ప్రభాకర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

భయం వీడితేనే జయం



మాట్లాడుతున్న పున్నం చందర్

ఎల్లారెడ్డిపేట: విద్యార్థులు పరీక్షలంటే భయం వీడితేనే విజయం సాధిస్తారని ప్రముఖ సైకాలజిస్ట్ కె.పున్నంచందర్ పేర్కొన్నారు. మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లోని జెడ్పీ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. జీవననైపుణ్యాలు, కెరీర్‌పై అవగాహన కల్పించారు. సోషల్‌మీడియా, యూట్యూబ్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. సైకాలజిస్టు అలువాల ఈశ్వర్, హెచ్ఎం మధుమాలతి, కెరీర్ గైడెన్స్ గైడ్ టీచర్ హజునాయక్, ఉపాధ్యాయులు మాలతి, రేవతి, బాలయ్య, రమేశ్‌రెడ్డి, కిష్టారెడ్డి, సదానందం పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బుగ్గరాజేశ్వరతండాకు చెందిన గజన్‌లాల్, రాచర్లబొప్పాపూర్‌లో వంగ మల్లారెడ్డి, రాచర్లగొల్లపల్లికి చెందిన పెంజర్ల నాంపల్లి మృతిచెందగా శనివారం బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పరామర్శించారు. నాంపెల్లి అంత్యక్రియల్లో పాల్గొని నివాళి అర్పించారు. జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సింగిల్ విండో చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు సుభాశ్, రమేశ్‌గౌడ్, కిషన్, బొమ్మనవేని సత్యం, ఇల్లందుల శ్రీనివాస్ రెడ్డి, రవీందర్ రెడ్డి, శ్రీధర్, తిరుపతి, బాలు, దేవేందర్ తదితరులున్నారు.

శిథిలావస్థలో పశువైద్యశాల



వేములవాడరూరల్: వేములవాడ మండల పరిషత్ ఆవరణలో ఉన్న పశువైద్యశాల శిథిలావస్థకు చేరింది. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన ఈ వైద్యశాలలోనే సిబ్బంది సేవలందిస్తున్నారు. నూతన భవన నిర్మాణం కోసం పలుసార్లు ప్రతిపాదనలు పంపినా అప్పటి పాలకులు, అధికారులు పట్టించుకోలేదు. ప్రస్తుతం మున్సిపాలిటీగా మారినా ఆస్పత్రి కోసం మాత్రం భవన నిర్మాణం జరగడం లేదు. ఇందులో ఒక వైద్యాధికారి మాత్రమే సేవలందిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా అటెండర్‌ను కూడా ఈ పశువైద్యశాలకు నియమించలేదు. వైద్యాధికారి బయటకు వెళ్తే పశువైద్యశాలలో ఎవరూ అందుబాటులో లేరు. వర్షాకాలంలో భవనమంతా నీటితో ఉరుస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వమైనా పశువైద్యశాలకు నిధులు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

గణపతి రూపంలో టమాట



తంగళ్లపల్లి(సిరిసిల్ల): విఘ్నేశ్వరుడి రూపంలో ఉన్న టమాట ఆదివారం అందరినీ అబ్బురపర్చింది. మండలంలోని అంకుషాపూర్ గ్రామ ఎంపీటీసీ కరికెవేని కుంటయ్య ఇంట్లో పెంచుతున్న టమాట మొక్కకు వినాయకుడి రూపంలో టమాటపండు కాసింది. ఎంపీటీసీ కుంటయ్య మాట్లాడుతూ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న చూసేంత వరకు గుర్తించలేదని వినాయక రూపంలో టమాట తమ ఇంట కాయడంపై ఆనందం వ్యక్తం చేశారు.

'ఈ నెంబర్ ఉపయోగంలో లేదు'



కోనరావుపేట ఠాణా బోర్డుపై ఫోన్‌నెంబర్లు

కోనరావుపేట: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ఏర్పాటు చేసిన ల్యాండ్ లైన్ ఫోన్‌నెంబర్ కొన్ని నెలలుగా పనిచేయడం లేదు. సెల్‌ఫోన్ నెంబర్ కూడా పాతది ఉండడంతో ఠాణాకు వచ్చే గ్రామీణ ప్రజలు తమ సమస్యలు ఎలా తెలపాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌కు ఉన్న బోర్డుపై ల్యాండ్‌లైన్, మొబైల్ నెంబర్ రాసి ఉన్నాయి. ల్యాండ్‌లైన్ నెంబర్ కొన్ని నెలలుగా పనిచేయడం లేదు. మొబైల్ నెంబర్ మారడంతో పోలీసులకు కొత్త నెంబర్ ఇచ్చారు. కానీ బోర్డుపై పాతనెంబరే రాసి ఉండడంతో తికమక పడుతున్నారు. పోలీస్‌స్టేషన్ బయట ఉన్న బోర్డుపై కొత్తగా ఇచ్చిన సెల్ నెంబర్‌తో పాటు, పనిచేయని ల్యాండ్‌లైన్ నెంబర్ రాసి ఉంది. మండలంలోని పలు గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు, రాత్రివేళల్లో ఇసుక అక్రమ రవాణా, కొన్నిగ్రామాల్లో పేకాట స్థావరాలు ఉండగా ఏదైనా అత్యవసర సమయంలో ఫోన్ చేయాలంటే ఉన్న నెంబర్ పనిచేయక, కొత్త నెంబర్ వేరే వాళ్లను అడుగలేక ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఫోన్ నెంబర్లు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బండలింగంపల్లి గ్రామశివారు మానేరు వాగునుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు శనివారం పట్టుకున్నారు. గ్రామ శివారు నుంచి ఇసుకను అధిక ధరకు కామారెడ్డి జిల్లా కేంద్రంలో విక్రయించేందుకు వెళ్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కోడూరి మనోహర్‌పై కేసునమోదు చేసినట్లు ఏఎస్సై కిషన్ రావు పేర్కొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

తంగళ్లపల్లి: మండలంలోని బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో ఆదివారం ఉత్తమ సేవా పురస్కార గ్రహీత డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి విద్యార్థినులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. 8, 9 తరగతి విద్యార్థులతో మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ దర్శనాల పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

కోనరావుపేట: వసతి గృహంలో ఉంటున్న విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంపీడీవో శశికళ అన్నారు. మండలంలోని ధర్మారంలో ఎస్సీ హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థుల వసతుల గురించి అడిగి తెలుసుకున్నా రు. అనంతరం హాస్టల్‌లోని విద్యార్థులతో ముచ్చటించారు. వార్డెన్ శ్రీనివాస్, కార్యదర్శి శ్రీకాంత్ తదితరులున్నారు.

ఓటుహక్కు వినియోగించుకోవాలి

బోయినపల్లి: ప్రతిఒక్కరూ విధిగా తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు పేర్కొన్నారు. మండలంలోని కోరెంలో కళాబృందం సభ్యులు స్వీప్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ఓటు ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి రవి, టీమ్ లీడర్ రాజు, కళాకారులు గడ్డం దేవయ్య, సంజీవ్, ఝాన్సీ, లావణ్య, శ్రీలత, శిరీష పాల్గొన్నారు.

నియామక పత్రం అందజేత

వేములవాడఅర్బన్: బీజేపీ వేములవాడ అర్బన్ మండల అధికార ప్రతినిధిగా కచం నిఖిల్‌ను నియమించారు. వేములవాడ అర్బన్ మండల అధ్యక్షుడు చింతపల్లి వేంకటేశ్వరరావు నియామకం పత్రం అందించారు. కార్యక్రమంలో యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జింక అనిల్, చింతపల్లి మోహన్ రావు, నాంపల్లి అరవింద్ తదితరులు ఉన్నారు.

ఎన్నికలకు సహకరించాలి

తంగళ్లపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని పార్టీల నాయకులు సహకరించాలని ట్రెయినీ ఎస్పీ రాహుల్ రెడ్డి అన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఆవరణలో అఖిల పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు.

క్లోరినేషన్ కిట్లు పంపిణీ

తంగళ్లపల్లి: మండలంలోని 30 గ్రామపంచాయతీలకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మిషన్ భగీరథ అధికారులు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు క్లోరినేషన్ కిట్లు అందజేశారు. ఎంపీడీవో(ఎఫ్ఏసీ) రాజు, మిషన్ భగీరథ ఇంట్రా ఏఈ అనిల్, సీనియర్ పంచాయతీ కార్యదర్శులు కృష్ణయ్య, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం చేస్తున్న యూత్ సభ్యులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బండలింగంపల్లికి చెందిన కొండపురం శేఖర్ అనారోగ్యంతో మృతిచెందగా, వారి కుటుంబానికి జంగారెడ్డి యూత్ సంఘం తరపున రూ. 21,500 ఆర్థికసాయం శనివారం అందజేశారు. కడు పేదరికం అనుభవిస్తున్న వారి కుటుంబానికి సంఘం సభ్యులు మానవతా దృక్పథంతో ఆర్థిక సాయం చేసి చేయూతనందించారు. దాతలు స్పందించి మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.